
sahanamvande.com

epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 24-09-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 156 EDITOR: ROHINI




# ఎల్‌నినో డెత్ అలర్ట్

## ఆరు నెలల్లో 4.5 లక్షల మంది బలి



- చికాగో వర్సిటీ క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ వెల్లడి
- భూగోళాన్ని భయపెడుతున్న సూపర్ ఎల్‌నినో
- ఇండియాలో 16 వేల మందికి మరణ శాసనం
- రాబోయే రోజుల్లో 1.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత




**వాతావరణం రోజురోజుకూ ఎలా మారిపోతుందో గమనిస్తున్నారా? ఉన్నట్టుండి వర్షం పడుతుంది, అంతలోనే ఎండ మండిపోతుంది! రాబోయే ఆరు నెలల్లో వాతావరణ మార్పులు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. 'సూపర్ ఎల్ నినో' ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా పెను విధ్వంసం సంభవించే ప్రమాదం ఉందంట! ఇది మన భారత్‌పై ఎలా ప్రభావం చూపబోతోందో చూద్దాం.**

**- సహనం వందే, హైదరాబాద్**

అమెరికాకు చెందిన చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ సరికొత్త సంచలన నివేదికను విడుదల చేసింది. సాధారణ సంవత్సరంతో పోలిస్తే రాబోయే ఫిబ్రవరి నాటికి అధిక వేడి కారణంగా సుమారు నాలుగున్నర లక్షల మందికి పైగా అదనంగా మరణించే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇది కేవలం వేడి వల్ల వచ్చే ముప్పు మాత్రమే కాదని, మునుపెన్నడూ లేనంత తీవ్రమైన వాతావరణ మార్పులకు సంకేతమని హెచ్చరిస్తున్నారు.

### 44 శాతం ఎండలు...

ఈసారి వస్తున్నది మామూలు ఎల్ నినో కాదు, దీనిని శాస్త్రవేత్తలు 'సూపర్ ఎల్ నినో' అని పిలుస్తున్నారు. భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత సాధారణం కంటే 1.2 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందంటున్నారు. దీంతో తీవ్రమైన ఎండలు ఉండే రోజుల సంఖ్య సాధారణం కంటే ఏకంగా 44 శాతం పెరుగుతుంది. ఇది కేవలం వేసవికి పరిమితం కాకుండా, రాబోయే శీతాకాలంలో కూడా తన ప్రతాపాన్ని చూపుతుంది. నేపాల్‌ను ముంచెత్తిన భయంకరమైన వరదల్లో చనిపోయిన వారి సంఖ్య కంటే దాదాపు 65 రెట్లు ఎక్కువ మంది చనిపోయే ప్రమాదం ఉంది.

### ఇండియాలో 15,800 మరణాలు

ఈ విపత్తు ప్రభావం మన భారతదేశంపైనా తీవ్రంగా పడనుంది. చికాగో నివేదిక ప్రకారం మన దేశంలో దాదాపు 15,800 అదనపు మరణాలు నమోదయ్యే ప్రమాదం ఉంది. ప్రత్యేకించి డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు చలికాలంలోనే సగానికి పైగా మరణాలు సంభవించే ప్రమాదం ఉందట. చలికాలం ముగిసిన తర్వాత వచ్చే వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమై ఈ మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### వివిధ దేశాల్లో దారుణాలు...

ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతంలో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా మారే అవకాశం ఉంది. నైజీరియా, సూడాన్, నైజర్, చాద్ వంటి దేశాల్లో సుమారు 66,800 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. నైజీరియా ఒక్క దేశంలోనే 31,400 మరణాలు సంభవించవచ్చని అంచనా వేశారు. ఇక ఇండోనేషియాలో 19,300 మరణాలు, బ్రెజిల్‌లో 13,300, ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయిలాండ్, కాంబోడియాలలో దాదాపు 19,400 అదనపు మరణాలు సంభవిస్తాయని అంచనా వేస్తున్నారు. మరో 20 సంవత్సరాల తర్వాత భూమిపై ఎలాంటి భయంకరమైన ఉష్ణోగ్రతలు ఉంటాయో, ఆ భవిష్యత్తు రూపాన్ని ఈ సూపర్ ఎల్ నినో మనకి ఇప్పుడే ప్రత్యక్షంగా చూపిస్తోందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

### పేద దేశాలపై ప్రభావం...

గ్లోబల్ సౌత్ లేదా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకే ఈ ఎల్ నినో వల్ల ఎక్కువ నష్టం జరుగుతుంది. తీవ్రమైన వేడిని తట్టుకోవడానికి అవసరమైన ఎయిర్ కండిషనింగ్, చల్లని తాగునీరు, మెరుగైన వైద్య సదుపాయాలు అక్కడ సరిగ్గా ఉండవు. బయట కష్టపడి పనిచేసే కూలీలు, రైతులు, వృద్ధులు, చిన్న పిల్లలు ఈ ఎండ దెబ్బకు ఎక్కువగా బలవుతుంటారు. కాబట్టి బహిరంగ ప్రదేశాల్లో మంచినీటి కేంద్రాలు, చల్లదనంతో కూడిన రిఫ్రెష్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో ఉపాధి హామీ, నిర్మాణ రంగానికి చెందిన కార్మికులకు పనివేళల్లో మినహాయింపులు లేదా విరామాలు ఇవ్వడం చాలా అత్యవసరం. ఆసుపత్రుల్లో ఎండదెబ్బ, డీహైడ్రేషన్ బాధితులకు తక్షణమే చికిత్స అందించేలా అత్యవసర వైద్య విభాగాలు సిద్ధంగా ఉండాలి.

### ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ వార్నింగ్...

మనం ఎన్ని వేడి హెచ్చరికలు జారీ చేశామనేది ముఖ్యం కాదు, ప్రజల ప్రాణాలను ఎంత సమర్థవంతంగా కాపాడగలిగామనేదే అసలైన సిద్ధత అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ లో ప్రారంభమైన ఈ ఎల్ నినో వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 100 శాతం కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ చెప్తోంది. కానీ దీని తీవ్రత, ప్రమాదాలు మాత్రం వచ్చే ఏడాది మధ్య వరకు వెంటాడుతూనే ఉంటాయి. ప్రకృతి ఇచ్చే హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే మానవాళి ఎంత పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందో ఈ రిపోర్ట్ చెప్తోంది.

# ప్రశ్నిస్తే దేశద్రోహి అంటారా?

## సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం

- అర్బన్ నక్సల్స్ అంటూ ముద్ర
- ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి పెను ముప్పు
- న్యాయవ్యవస్థ షాకింగ్ వార్నింగ్!



**మన దేశంలో ఈమధ్య ఒక విచిత్రమైన అలవాటు ఎక్కువైపోయింది. ఎదుటి వ్యక్తి అభిప్రాయం నచ్చకపోతే చాలు... వెంటనే దేశద్రోహి అనో, అర్బన్ నక్సల్ అనో ఒక పెద్ద ముద్ర వేసేస్తుంటారు. అసలు చట్టం దృష్టిలో నేరం అంటే ఏంటి? ఒక వ్యక్తి చేసిన పనిని నేరంగా పరిగణించాలంటే ఎలాంటి నియమాలు ఉండాలి? పేర్లు పెట్టడం తేలికే కానీ ఒక చట్టం ద్వారా ఒకరిని నేరస్థుడిగా మార్చడం అంత సులువు కాదు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన కీలకమైన అంశాలు ఏంటో తెలుసుకుందాం. - సహనం వందే, హైదరాబాద్**

మన సమాజంలో ఇష్టమొచ్చినట్లు ముద్రలు వేయడం సర్వసాధారణం అయిపోయింది. భావ ప్రకటన స్వేచ్ఛను ఉపయోగించి ఎవరిపైనైనా దేశద్రోహి లేదా అర్బన్ నక్సల్ అనే నిందలు వేసేస్తుంటారు. అయితే సోషల్ మీడియాలో లేదా బయట మాట్లాడే మాటలకు, చట్టపరమైన నేరానికి మధ్య చాలా పెద్ద తేడా ఉంటుంది. మన రాజ్యాంగం ప్రకారం ఒక చట్టం ద్వారా మాత్రమే ఒక చర్యను నేరంగా గుర్తించగలరు. కేవలం ఒక ముద్ర వేసినంత మాత్రాన లేదా కొంతమంది అభిప్రాయపడినంత మాత్రాన ఏదీ నేరం అయిపోదు. అందుకే నేరం అంటే ఏంటో చాలా స్పష్టంగా నిర్వచించాల్సిన అవసరం ఉందనే చర్చ ఇప్పుడు నడుస్తోంది.

### సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం...

ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌స్టర్ చట్టానికి సంబంధించిన ఒక కేసులో సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టం కింద ఒకరిని గ్యాంగ్‌స్టర్ అని ముద్ర వేసి కేసులు పెట్టడంపై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏ చట్టమైనా ఏది నేరమో స్పష్టంగా చెప్పాలి కానీ, కేవలం ఒక కేటగిరీని సృష్టించి నేరస్థులను చేయకూడదని స్పష్టం చేసింది. చట్టంలోనే నేరం ఏంటో సరిగ్గా చెప్పనప్పుడు... ఆ చట్టం పుట్టుకతోనే ప్రాణం లేనిదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. న్యాయసూత్రాల ప్రకారం చట్టంలో ముందే స్పష్టమైన నిబంధన లేకపోతే ఎవరినీ శిక్షించడానికి వీలులేదు.

### సొంత నిర్ణయాలతో కొత్త నేరాలు

చట్టాలు చేసే అధికారం కేవలం ప్రజలచే ఎన్నుకోబడిన శాసనసభలకు, పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. ప్రభుత్వం లేదా పోలీసులు తమ సొంత నిర్ణయాలతో కొత్త నేరాలను సృష్టించలేరు. అధికార యంత్రాంగం తయారుచేసే రూల్స్ ద్వారా ఒక వ్యక్తిని నేరస్థుడిగా మార్చడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు విరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 20(1) ప్రకారం ఒక పనిని చేసే సమయానికి అది చట్ట ప్రకారం నేరం అయితేనే శిక్ష పడుతుంది. అధికారుల ఇష్టానుసారంగా ఇచ్చే ఆదేశాలు లేదా నోటీసుల ఆధారంగా ఒకరి హక్కులను హరించడం తీవ్రమైన నేరం.

### కేసు నమోదు చేసే ధోరణి...

ఈ మధ్యకాలంలో నేరం అంటే ఏంటో చెప్పకుండా ముందుగా ముద్ర వేసి ఆ తర్వాత కేసు నమోదు చేసే ధోరణి ఎక్కువైంది. ఒక వ్యక్తి నిజంగా సమాజానికి హాని చేశాడా లేదా అనేది ఆధారాల ద్వారా నిరూపించాలి. కానీ కేవలం రాజకీయంగానో లేదా ఆరోపణల రూపంలోనో విమర్శలు చేయడం వల్ల సదరు వ్యక్తి జీవితం నాశనమవుతుంది. ఇటువంటి పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పుగా మారతాయని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే నేరం, చట్టపరమైన తప్పిదం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం చాలా అవసరం. ఏదైనా ఒక నేరానికి శిక్ష విధించాలంటే ఆ నేర స్వభావం చాలా ఖచ్చితంగా రాసి ఉండాలి. గ్యాంగ్ లేదా ముఠా అని అనడమే తప్పు, ఆ ముఠా చేసే ప్రత్యేక నేరం ఏంటో చెప్పకపోవడం చట్టపరంగా పెద్ద లోపం. ఇటువంటి లోపాల వల్ల ఎందరో అమాయకులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.


### అమాయకులను కాపాడాలి...

న్యాయవ్యవస్థ ప్రధాన ఉద్దేశం అమాయకులను కాపాడడం, నిందితులకు తగిన శిక్ష పడేలా చూడడం. అయితే అధికారులు తప్పుడు ముద్రలతో కేసులు పెట్టినప్పుడు కోర్టులు తీవ్రంగా స్పందిస్తున్నాయి. ఒక వ్యక్తి హక్కులను కాలరాస్తూ విచారణ లేకుండా దీర్ఘకాలం నిర్బంధంలో ఉంచడం రాజ్యాంగ విరుద్ధం. ప్రివెంటివ్ డిటెన్షన్ వంటి తీవ్రమైన చట్టాలను కూడా చాలా జాగ్రత్తగా, కచ్చితమైన నిబంధనలతో మాత్రమే ఉపయోగించాలి.

# వినాయకుడి ముందే వికృతచేష్టలు

## మహిళలపై ఆకతాయిల ఈవ్‌టీజింగ్

- 10 రోజుల్లో ఏకంగా 1,530 మంది అరెస్ట్
- మఫ్టీలో తిరుగుతున్న మహిళా పోలీసులు
- మహిళలకు రక్షణగా షీ టీమ్స్ డేగ కన్ను



**భక్తిశ్రద్ధలతో, డప్పు దరువులతో వినాయక చవితి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్న వేళ కొంతమంది ఆకతాయిల ప్రవర్తన చూస్తే ఎవరికైనా ఒళ్లు మండిపోవాల్సిందే. పండగ వాతావరణాన్ని ఆసరాగా చేసుకుని గుంపుల్లో మహిళలను వేధించవచ్చని అనుకున్నారా? అయితే హైదరాబాద్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన షాకింగ్ ట్విస్ట్ ఏంటో మీకు తెలుసా? దాదాపు 10 రోజుల వ్యవధిలోనే వేల సంఖ్యలో ఆకతాయిలను లోపల పడేసి పోలీసులు తమ పవర్ ఏంటో చూపించారు! అసలు అక్కడ ఏం జరిగింది? - సహనం వందే, హైదరాబాద్**

ఈ నెల 14 నుంచి 23 తేదీల మధ్య భాగ్యనగరంలో గణేష్ నిమజ్జన వేడుకలు ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. నగరంలోని ప్రసిద్ధ వినాయక మండపాల వద్ద, ప్రత్యేకించి ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనానికి, హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఇలాంటి పవిత్రమైన ఉత్సవాల సమయంలో కొందరు ఆకతాయిలు మాత్రం భక్తి భావాన్ని పక్కన పెట్టి తమ పాత బుద్ధులను ప్రదర్శించారు. ఉత్సవాల కోలాహలం మధ్య జనసందోహాన్ని ఆసరాగా చేసుకుని మహిళలను ఇబ్బంది పెట్టడానికి, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటానికి ప్రయత్నించారు. అయితే నగర పోలీసులు ఈ విషయాన్ని ఎంతమాత్రం తేలిగ్గా తీసుకోలేదు. కేవలం ఈ 10 రోజుల వ్యవధిలోనే నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్, అసభ్యకరంగా ప్రవర్తించిన ఏకంగా 1,530 మందిని పోలీసులు పట్టుకుని కస్టడీలోకి తీసుకున్నారు.

### షీ టీమ్స్ క్రియాశీలక పాత్ర...

ఈ నిమజ్జన వేడుకల సమయంలో షీ టీమ్స్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషించాయి. సాధారణంగా వీధుల్లో కాపలా కాసే కాప్స్ వేరు, వీళ్లు వేరు. వీరంతా సాదాసీదా దుస్తుల్లో, సాధారణ భక్తుల్లాగే జనసందోహంలో కలిసిపోయి నిఘా పెట్టారు. మండపాల పరిసరాలు, క్యూ లైన్లు, నిమజ్జనం జరిగే ఊరేగింపు మార్గాల్లో వీరు నిరంతరం పరికించి చూశారు. ఎక్కడైనా ఎవరైనా మహిళలతో తప్పుగా ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తే వెంటనే రంగంలోకి దిగారు.

### కెమెరాలతో ప్రత్యేక పెట్రోలింగ్ టీమ్‌లు

పోలీసులు కేవలం కంటిచూపుపైనే కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా విస్తృతంగా ఉపయోగించారు. కెమెరాలతో కూడిన ప్రత్యేక పెట్రోలింగ్ టీమ్‌లు, నగరమంతటా అమర్చిన సీసీటీవీ నెట్‌వర్క్ ద్వారా పరిసరాలను రౌండ్ ది క్లాక్ మానిటర్ చేశారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఆకతాయిలు చేసే చిన్న చిన్న చౌకబారు చేష్టలను కూడా కెమెరాల్లో స్పష్టంగా రికార్డు చేశారు. ఎవరైనా తప్పు చేస్తూ కెమెరాకు చిక్కితే, వారు తప్పించుకునే లోపే షీ టీమ్ సిబ్బంది వారిని స్పాట్‌లోనే పట్టుకున్నారు. సాక్ష్యాలతో సహా దొరికిపోవడంతో ఆకతాయిలు నోరెళ్లబెట్టాల్సి వచ్చింది.

### అసభ్యకరంగా ప్రవర్తించడం...

అరెస్టయిన 1,530 మందిలో కేవలం వేధింపులకు పాల్పడిన వారే కాకుండా, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించిన వారు కూడా ఉన్నారు. మద్యం సేవించి గొడవలు చేయడం, అసభ్యకర సైగలు చేయడం, మహిళలను అడ్డుకోవడం వంటి పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నా రు. అరెస్ట్ చేసిన అందరిపైనా చట్టపరమైన కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సిద్ధం చేశారు. పండగ ఉత్సవాలు అంటే ఆనందంగా జరుపుకోవడానికి గానీ, ఇలాంటి అల్లరి మూకల చేష్టలను సహించడానికి కాదని పోలీసులు గట్టి సంకేతాన్ని పంపారు.

### దేశంలోనే ప్రతిష్టాత్మకం...

నగరంలో మహిళలకు రక్షణ కల్పించడంలో హైదరాబాద్ పోలీస్ విభాగానికి భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. షీ టీమ్స్ సేవలు ప్రారంభమైనప్పటి నుంచి ఈవ్‌టీజింగ్ కేసులు గణనీయంగా తగ్గాయి. పండగల సమయాల్లోనే కాకుండా, సాధారణ రోజుల్లో కూడా కాలేజీలు, బస్ స్టాప్‌లు, ఐటీ కారిడార్లు, నిత్యం రద్దీగా ఉండే మార్కెట్లలో పోలీసుల పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఈసారి పండగ సందర్భంగా సాధించిన ఈ విజయం పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచింది.

